# దేహము పవిత్రము కావాలంటే దైవనామము స్మరించాలి

సుందరోపి సుశీలోపి కులీనోపి ధనేనపి
న శోభతే విద్యాహీనే విద్యాసర్వస్య భూషణం

ప్రేమస్వరూపులైన విద్యార్థులారా!

సౌందర్యము, సౌశీల్యము, సౌజన్యము, సౌభ్రాతృత్వము ఇవి ఎన్ని ఉండినప్పటికిని సంస్కృతియే లేకుండిన ఇవన్నియు నిరుపయోగములే! సంస్కృతి లేని జీవితము కేవలము దేవుడు లేని గుడివంటిది. నీరు లేని పైరు వంటిది. కరెంటు లేని వైరు వంటిది. ఇట్టి జీవితము ఈ విశాలమైన ప్రపంచమందు ఏవిధమైన సుఖశాంతులు పొందగలదు! ఈనాటి ప్రపంచములో అనేక విధములైన శక్తి, సామర్థ్యములు ఆర్జించి అనేక పరిశోధనలు సల్పి విజ్ఞాన శాస్త్రమందు అతి ప్రవీణులని పేరు పొందిన అమెరికా, రష్యా దేశములు ఎంతయో గర్వించుచున్నవి. కానీ, వేదకాలమునుండి భారత దేశము వైజ్ఞాన శాస్త్రమందు అనంతమైన అభివృద్ధులను చూచింది. అనుభవములను అనుభవించింది, ఆదర్శముల నందించింది.

**ఆధ్యాత్మిక జీవనమునకు వేదమే ప్రమాణము**

ఈనాటి భారతదేశ చరిత్ర వేదకాలమునుండియే ప్రారంభమైంది. వేదమందు పవిత్రమైన మంత్రములు, శక్తివంతమైన యంత్రములు, మహా తీవ్రమైన తంత్రములు ఏనాడో ప్రారంభమైనవి. ఆధ్యాత్మిక జీవితమునకు వేదమే ప్రమాణము, ఆధారము. వేదములలో 'అధర్వణ వేదమును అనేకమంది పరిశోధనలు జరుపుతూ వచ్చారు. జపానువారు, జర్మనీవారు ఈ అధర్వణ వేదమును అనేక విధములుగా పరిశోధనలు చేస్తూ వచ్చారు. భారతీయుల యొక్క పవిత్ర చరిత్రలు ఇట్టివి అట్టివి అని ఎవరు వర్ణించలేరు. మొట్టమొదట భారతీయుల నోటినుండి

srisathyasaivachanamrutam

వచ్చిన పదము వేదమే. ప్రతి భారతీయ మానవుడు మొట్టమొదట వేదము పలుకుతూ వచ్చాడు. దీనిని గ్రిఫిత్ అనే జర్మనీ దేశస్థుడు అనేక విధముల పరిశోధనలు సలుపుతూ వచ్చాడు. ఈ వేదమునుండియే గొప్ప సైంటిస్టు అయిన విశ్వామిత్రుడు గాయత్రి మంత్రమును ఆవిర్భవింప చేశాడు. ఈ విశ్వామిత్రుడు కేవలము గాయత్రీ మంత్రము ఉచ్చరించుటే కాక, ఆదిత్య తేజస్సునుండి అనేక పరిశోధనలు చేసి ఆగ్నేయాస్త్రము, ప్రకాశాస్త్రము ఇలాంటి గొప్ప అస్త్రశస్త్రములను తాను కనిపెడుతూ వచ్చాడు. అట్టి అస్త్రములన్నీ శ్రీరామచంద్రునకు అర్పితము చేస్తూ వచ్చాడు. ఇది ఎన్నో వేల సంవత్సరముల పూర్వము జరిగినది. భారతీయులు విజ్ఞానశాస్త్రమందు వెనుకబడినవారు కాదు. భారతీయులు శోధించి సాధించి విడచినదానినే ఈనాడు విదేశీయులంతా ఆధారము చేసుకుంటున్నారు. ఇంతేకాదు, మరికొన్ని సాధారణమైనవి. ఏరోప్లేను, అమెరికాలో రైట్ బ్రదర్సు 1903 సం॥లో కనిపెట్టారు. కానీ 1896లో జర్మనీవారు కనిపెట్టారు. దీనిని కనిపెట్టిన వ్యక్తి ఎవరు? ఎలిలీ కనిపెట్టాడు. కానీ కట్టకడపటికి క్రిందపడి మరణించాడు. 1895లో మన భారతీయులు మొట్టమొదట కనిపెట్టారు. శివరామ్ బాపూజీ ఛటర్జీ అని బొంబాయిలో ఉండేవాడు. అతను 1500 అడుగులు పైకివెళ్లాడు. అతనికి తగిన సహాయం ఆనాటి బరోడా మహారాజు మహాదేవ్ గోవిందరణా అనే అతను అనేక విధములుగా చేశాడు. 1895లోనే భారతీయులు కనిపెట్టారు ఈ విమాన యంత్రమును. ఇంత మాత్రమేకాదు. గణిత శాస్త్రమంతా భారతదేశమునుండి వచ్చినదే! ఈ విధంగా విచారణ చేసి చూస్తే అన్నింటిలో భారతదేశమే ముందంజ వేస్తోంది. కానీ దురదృష్టవశాత్తు భారత దేశంలో ఐకమత్యము లేకపోవటంవలన, అసూయ పెరిగిపోవటం చేత దీనిని సరైన రీతిలో ప్రచార ప్రబోధలు సలుపలేకపోయాయి. ఇంక వైద్య శాస్త్రములో భారద్వాజ మహర్షి కృషిచేశాడు. అస్త్రశస్త్ర విద్యలచేత ఈశాస్త్ర పరిశోధనలు చేశాడు. అనగా ఈనాటి ఆపరేషన్లు అన్నీ కూడను ఆనాడే భారద్వాజుడు కనిపెట్టాడు. ఇంక ప్రపంచమునకు ఒక ధర్మము కావాలి. 'ధర్మో రక్షతి రక్షితః' అదియే జగత్తును రక్షించేది. ఈ ధర్మశాస్త్రమును మనుచక్రవర్తి కనిపెట్టాడు. న్యాయశాస్త్రమును గౌతముడు కనిపెట్టాడు. అర్థిక శాస్త్రమును చాణుక్యుడు కనిపెట్టాడు. ఈ సకల విద్యలు భారతదేశమునుండి ఆవిర్భవించినవే. ఇట్టి పవిత్రమైన భారతదేశముయొక్క శక్తి, సామర్థ్యములు ఈనాడు విద్యార్థులు గుర్తించుకొనలేక విదేశీయులపై ఆధారపడుతూ

sri sathyasai vahamrutam

వస్తున్నారు. అన్ని శక్తులు కూడ మంత్రయంత్ర తంత్ర శక్తులన్నీ భారతదేశమునుండియే వెలువడినవి.

**భారతీయ సంస్కృతి సజీవమైనది**

ఇంతియేకాదు. స్త్రీ జాతియందు గతించిన పతిని దక్కించుకున్నది సావిత్రి. ఆమెయొక్క శక్తి, సామర్థ్యములు చాలా గొప్పవి. తన పతి మరణించకుండా ఉండేందుకు సూర్యోదయము కాకుండా చేసింది సుమతి. ఇలాంటి గొప్పశక్తులు స్త్రీ పురుషులందు భారతదేశములో నాటినుండి నేటివరకు ప్రకాశిస్తూ వస్తున్నవి. భారతీయ సంస్కృతి ఇట్టిది, అట్టిది అని చెప్పుటకు వీలుకాదు. అనంతమైన సముద్రమువంటిది. ఈ సముద్రమునుండి ఎన్ని పంపుసెట్లతో నీటిని తోడినప్పటికి ఇది ఒక్క ఇంచికూడా తగ్గదు. సమత్వంతో ఉంటుంది, భారతీయ సంస్కృతి. ఎన్ని నదులో వర్షాకాలములో ప్రవహించి చేరిపోతున్నాయి, సముద్రంలో. కానీ ఒక ఇంచైనా పెరగటం లేదు. నిత్యము సూర్యునియొక్క వేడిచేత నీరు ఆవిరైపోతుంది. కానీ ఇంచి అయినా పెరగదు, తరగదు. అట్టి పెరిగి తరగని స్థితియే భారతీయ సంస్కృతి. ఎవరు ఎన్ని విధములైన ప్రమాదములు సంభవింపచేసినప్పటికి, ఈ భారతదేశమందు సంస్కృతి అనేది నేటికీ ప్రాణముతోనే ఉంటున్నది. ఎన్ని దేశములవారో ఈ సంస్కృతిని నిర్మూలము గావించాలని ప్రయత్నించారు. కాని ఒక్కరు కూడా దీనిని కదలించలేకపోయారు. ఈ భారతీయ సంస్కృతి ఒక్క భారతదేశమునకే పరిమితమైనది కాదు. యావత్ ప్రపంచమునకే ఇది యదార్థమైనది. అందరు కలసిమెలసి ఉండాలి. అందరు కలసిమెలసి జీవించాలి. అందరు కలసిమెలసి ఆనందముగా ఉండాలి. అందరు కలసిమెలసి అన్యోన్యంగా ఉండాలి. కనుకనే మానవత్వమునకు చెందినది ఈ సంస్కృతి. ఏ దేశములో పుట్టినా రంగులు వేరు కావచ్చు, పేర్లు వేరు కావచ్చు. రూపములు వేరు కావచ్చు. కానీ మానవత్వము ఒక్కటే. కనుక ఎక్కడికి పోయినప్పటికి మానవత్వం ఒకే జాతి. ఆ జాతికి ఏ భేదములు లేవు. ఇట్టి భేదములు లేని తత్త్వమును బోధించింది భారతీయ సంస్కృతి.

**రాగ, ద్వేష, అహంకారములు దూరము చేస్తే దివ్యత్వము సాక్షాత్కరిస్తుంది**

కొందరు పండితులు దైవాన్వేషణ అనగా దైవమును వెతకటము అని అర్థము చెప్తారు. కానీ ఇది వెతకటం కాదు. సర్వత్రా ఉన్న దైవమును వెతికేది ఎక్కడ? సర్వజీవులయందున్న



sri sathyasaivachanamrutam

దైవమును వెతికేది ఎవరు? అయితే ఈ అన్వేషణ అనే పదము ఎలా పుట్టింది? దైవము జపముచేతనో లేక ధ్యానంచేతనో లేక భజనచేతనో లేక పూజలచేతనో లభ్యమయ్యేదికాదు. ఇవన్నీ కేవలము స్థిర చిత్తమునకు సహాయము చేసే సత్కర్మలే! దైవాన్వేషణ అనగా ఏమిటి? రాగ ద్వేష అహంకారములను వదలించుకోవటమే అన్వేషణ. నిప్పు ఉంది. ఈ నిప్పును అలక్ష్యము చేయటంచేత దానిమీద నివురు వచ్చి కప్పుకుంటుంది. ఈ నివురును ఎలా తియ్యాలి? ఈ నివురు ఎలా వచ్చింది? అగ్నినుండే వచ్చింది. అగ్నినే మూసివేసింది. మేఘములు ఎక్కడనుండి వచ్చాయి? సూర్యుని తేజస్సునుండి వచ్చాయి. సూర్యుని తేజస్సునుండి వచ్చిన మేఘములే సూర్యుని కప్పి వేస్తున్నాయి. ఒక బావిలో ఉపయోగించని నీరుండినప్పుడు ఆ నీటినుండే పాచి ప్రారంభమవుతుంది. ఆ నాచు నీటిని కప్పివేస్తుంది. మన కంటి దృష్టి ఉంది. కానీ క్యాట్రాక్టు బయలుదేరితే దృష్టినే కవర్ చేస్తుంది. ఇది ఎక్కడనుండి వచ్చింది? కంటినుండే వచ్చింది. బయటనుండి రాలేదు. నిప్పునుండి వచ్చిన నివురు పోవాలంటే ఉఫ్ అని ఊదాలి. ఆ నివురు పోతే నిప్పు కనిపిస్తుంది. చల్లని గాలులు వీస్తే మేఘములు కదలిపోతాయి. సూర్యుడు కనిపిస్తాడు. సూర్యుడు కొత్తగా ఉద్భవించలేదు. అదే విధముగా పైన కప్పిన నాచు తీసేస్తే నీరు కనిపిస్తుంది. కంటిలోని పొరను తీసేస్తే తిరిగి దృష్టి వస్తుంది. అదే విధముగా మానవుని ఆవరించిన రాగద్వేష అహంకారములు మూడూ మానవత్వమనే దివ్యత్వమును మరపింప చేస్తున్నాయి. ఈ రాగద్వేష అహంకారములు దూరము చేస్తే మన దివ్యత్వము మనకు సాక్షాత్కరిస్తుంది.

ఈ విధమైన శాస్త్రములను భారతదేశము ప్రజలకు ఆదేశిస్తూ వస్తున్నది. ప్రాచీన కాలములో సంస్కృతము అందరికి తెలిసినదిగా ఉండేది. రానురాను భారతదేశములో సంస్కృత భాషే అడుగంటిపోయింది. భారతీయ చరిత్రలన్నీ, వ్యాఖ్యలన్నీ సంస్కృతములోనే నిండినవి. భారతదేశ సంస్కృతిని ఎవరు ఏవిధముగా వర్ణించలేరు. ఇటువంటి సంస్కృతిని మనము ఈనాడు మరిచి, లేనిపోని విదేశీ సంస్కృతిలో మనము పాటుపడి మన దివ్యత్వమును, మన స్వరూపమును మనం మరచిపోతున్నాము. ప్రాకృతమైన వాంఛలు పెరిగిపోతున్నాయి. అంతర్భావ సంబంధమైన వాంఛలు తరిగిపోతున్నాయి. మొట్టమొదట అంతర్భావమును ఆవిర్భవింప చేసుకోవాలి. బాహ్యమైనవి క్షణ భంగురములు.

విద్యార్థులారా! మీరు యువకులు. యవ్వనములో అనేక అలలు, తెరలు, పొరలు పుడుతుంటాయి. దానికే శంకరులవారు చెప్పారు: 'మాకురు ధనజన యవ్వనగర్వం, హరతి నిమేషాత్ కాల స్సర్వం' అని. ఏమిటీ యవ్వనగర్వం? మధ్యలో వచ్చి మధ్యలో పోయేది. ఒక అరనిమిషములో కదలిపోయేది. అలాంటి దానిని మనం శాశ్వతంగా భావిస్తున్నాము. శాశ్వతమైన ఆనందమును క్షణభంగురముగా భావిస్తున్నాము. ఇది కాదు. మనము నేర్చే విద్యలన్నీ సంస్కారముతో కూడినవిగా ఉంటుండాలి. కాశీలో శంకరులవారు శిష్యులతో కలసి స్నానమునకు బయలుదేరివెళ్లారు. దారిలో వృద్ధుడైన ఒక పండితుడు 'డుకృఞ్ కరణే' అని వల్లిస్తున్నాడు. విన్నాడు శంకరులవారు. ఏమిటి ఈ పిచ్చివిద్యలు! ఏమిటి ఈ వ్యాకరణము! ఆధ్యాత్మిక మార్గములో పురోగమించడానికి 'డుకృఞ్ కరణే' ఏవిధమైన సహాయము చేస్తున్నాది? ఏ సహాయమూ చేయదు. పిచ్చివాడా! ఇది కేవలము నిన్ను ఉద్ధరిస్తుందని విశ్వసిస్తున్నావు.

**భజగోవిందం భజగోవిందం గోవిందం భజ మూఢమతే**
**సంప్రాప్తే సన్నిహితే కాలే నహినహి రక్షతి డుకృఞ్ కరణే.**

ఓ పిచ్చివాడా! ఏమిటి ఈ డుకృఞ్ కరణే? ఏమిటి రక్షిస్తుంది నిన్ను? ఏ ప్రమాదములో నిన్ను రక్షిస్తుంది? రక్షించదు. భగవంతుని స్మరించు. గోవిందుడు ఎక్కడ? కేవలం నీయందే ఉంటున్నాడు. దైవత్వము బయట ప్రదేశములో లేదు. సర్వత్రా ఉంటున్నది. లోపల, వెలుపల సర్వత్రా ఉంటున్నది. కానీ ఏమీ తెలియనివాడు భగవంతుని వెతుకుతున్నాడు. ఇది కేవలము మూర్ఖత్వమే అవుతుంది. ఇది వెతకవలసినది కాదు. తెలుసుకోవలసినది ఏవిధంగా? తనకున్న దుర్గుణములు దూరము చేస్తే దాని పాటికి అదే బయట పడుతుంది. ఇవన్నీ దానికి కప్పబడినవి. కప్పబడినవి తీసివేస్తే నీ స్వస్వరూపము నీకు సందర్శన మవుతుంది.

**ఆత్మతత్త్వము సర్వత్ర వ్యాపించి ఉంటున్నది**

మానవునియందనేక శక్తులుంటున్నాయి. ఈ సైంటిస్టులు ఏమేమి కనిపెడుతున్నారో ఆ సర్వశక్తులు మానవునియందే ఉంటున్నాయి. కేవలము బాహ్యమైన పరిశోధనలు సల్పుతూ వస్తున్నారే గానీ అంతర పరిశోధనలు సల్పటం లేదు. ఆ మనిషి ఉన్నాడు. కెమేరాతో ఫోటో తీస్తే ఆ మనిషి పిక్చరు ఫోటోగా వస్తుంది. అయితే ఎలాంటి పిక్చరు వస్తుంది? దేహముపై

ఏఏభాగములున్నాయో, ఏ వస్త్రములు వేసుకున్నావో ఏఏరంగులుంటున్నాయో అవన్నీ వస్తున్నాయి. అయితే బాహ్యమైనవి వస్తున్నాయి గానీ అంతరమైనవి రావటంలేదు. కాని, ఎక్స్-రే ఫోటో తీస్తే బోన్స్ అవి వస్తాయి. ఈనాటి విద్యలు ఈ బాహ్యమైన ఫోటోగ్రాఫుల వంటివి. ఆధ్యాత్మిక విద్య ఎక్స్-రే ఫోటో వంటిది. లోపల నున్నదంతా కనిపించేది. కనుక, ఆధ్యాత్మికము అత్యవసరము. ఈనాటి చదువులు నైతికము, ధార్మికము, ఆధ్యాత్మికము మూడూ లేని చదువులుగా రూపొందుతున్నాయి.

ఆనాటి విశ్వామిత్రుడు గొప్ప తపస్సు చేశాడు. తపస్సు చేయటంచేత ఆదిత్య హృదయము కనిపెట్టాడు. ఆదిత్య హృదయమునుండి అన్ని అస్త్రములు ప్రారంభమైనాయి. ఇంత గొప్ప అస్త్రములుండి శ్రీరామచంద్రుని ఎందుకు శరణు జొచ్చాడు? ఆ రాక్షసులను వధించటానికి శ్రీరామచంద్రుని ఎందుకు ఆశ్రయించాడు? అక్కడ కొన్ని పద్ధతులుంటున్నాయి. విశ్వామిత్రుడు తపస్సు చేస్తున్నప్పుడు యాగము చేయాలి. యాగము చేసే సమయంలో ఆ వ్యక్తి ఏ హింసలకూ పాల్పడకూడదు. యాగదీక్ష పూనాడు. దీక్ష నిలబెట్టుకునే నిమిత్తమై తనలో ఏవిధమైన క్రోధముగానీ, ద్వేషముగానీ ఆవిర్భవించరాదు. బ్రహ్మగా నిల్చి యాగము చేస్తున్నాడు కనుక తనకు సహాయముగా రాముడు ఉండాలని కోరాడు. రాముడనగా ఎవరు? దశరథ మహారాజు యొక్క కుమారుడు కాదు, 'రమయతీతి రామః', ఆత్మారాముడు. ఆత్మతత్త్వము సర్వత్రా ఉంటున్నాది. ఆత్మ సర్వులయందు ఉంటున్నాది. ఈ చైతన్యమే భగవత్స్వరూపము. అదే అందరియందు సమత్వంగా ఉంటున్నాది.

మన ఆత్మసాక్షికి ఏమాత్రము విరుద్ధముగా పోకూడదు. అదే దైవాజ్ఞ. దానిని మనము ఆచరణలో పెట్టడానికి ఇన్ని రకములైన ప్రయత్నములు చేస్తున్నాము. దీనికి ఏ ప్రయత్నము చేయనక్కరలేదు. హృదయపూర్వకముగా ప్రేమిస్తే చాలు. అదే ఆవిర్భవిస్తుంది. ఒక చిన్న ఉదాహరణ. చిన్న బిడ్డను క్రిందపెట్టింది. అమ్మ మిద్దెపై పని చేస్తున్నది. బిడ్డ ఏడ్చింది. పైన తల్లి పని వదలి క్రిందికి దిగివస్తుంది. తల్లి వచ్చి ఆ బిడ్డను ఎత్తుకొని ఆ ఏడుపు మానిపిస్తుంది. ఈ ప్రకృతియందు మానవుడు అనేక కష్టములకు, దుఃఖములకు గురైపోతున్నాడు. కెవ్వున ఏడుస్తాడు భగవంతుని కోసమని. అప్పుడు భగవంతుడు ఎక్కడ ఉండినప్పటికి ఠక్కున

srisathyasaivachanamrutam

దిగివచ్చేస్తాడు. ఎలా? హృదయపూర్వకముగా ప్రార్థన చేయుటవే ఏడవటము. హృదయపూర్వకంగా ప్రేమించటమే ఏడ్వటము. అంతేగాని పైనుండి క్రిందకు తల్లి దిగిరావాలంటే నాబిడ్డ ఏకారణంగా ఏడుస్తోంది, ఏ స్థితిలో ఏడుస్తుంది అని ఏ తల్లి ఏమాత్రం విచారించదు. ఏడుస్తే చాలు పరుగెత్తి వస్తుంది. ఈనాడు మానవులందరు ఏడుస్తున్నారు.

**పుట్టినపుడు ఏడ్చినారు చచ్చినపుడు ఏడ్చినారు**
**మధ్యమధ్య విషయాలకు ఎందుకెందుకొ ఏడుస్తారు;**
**ధర్మగ్లాని సంభవింప ఉద్ధరింప ఏడ్చినార?**
**ఎందుకోసమేడ్చినారు? ఏడ్పుకోసమేడ్చినార?**

దైవం కోసం ఏడ్వటంలేదు. అదియే రామకృష్ణ పరమహంస కూడా చెప్పాడు. “స్వామీ! మీకు అయినట్లుగా దైవసాక్షాత్కారం మాకు అవుతుందా!” అని ఒకరు ఆయనను అడిగారు. “తప్పక, తప్పక జరుగుతుంది. నేను, నీవు ఎట్లా మాట్లాడుతున్నామో దైవముతో నీవుకూడా అలా తప్పక మాట్లాడవచ్చు. అయితే ఎలా? ఎలా అంటే నీవు భార్యకోసం ఏడుస్తున్నావు. పిల్లలకోసం ఏడుస్తున్నావు. ఉద్యోగము కోసము పాటుబడుతున్నావు. పదవులకోసం ఏడుస్తున్నావు. దైవముకోసం ఏడుస్తున్నావా! కేవలం అదే ఏడుపు దైవము కోసం ఏడు. తప్పక దైవం ప్రత్యక్షమవుతాడు”, అని రామకృష్ణ చెప్పాడు.

**ఆత్మవిశ్వాసము, దైవమునందు విశ్వాసము ఉండాలి**

దైవం ఎక్కడో లేదు. తనయందే ఉంటున్నాడు. తనలో దానినే తాను చూడలేకపోతున్నాడు. అనేకమంది ముక్కుపైన అద్దాలు పెట్టుకుంటారు. ముఖము కడుక్కునేటప్పుడు తీసిపెడతారు, తిరిగి వేసుకుంటారు. తన ముక్కుపైనున్న అద్దాలు ఎక్కడ వెతికితే చిక్కుతాయి? ఈనాడు అలాగే ఉంది. తన ముక్కుపైన అద్దాలు పెట్టుకొని అద్దాలెక్కడయని వెతుకుతారు. దైవము ఎక్కడ అని వెతికేవారు తనను తాను ఎక్కడ అని వెతికే మూర్ఖులుగా ఉన్నారు. ఎక్కడ చిక్కుతాడు దైవం వీరికి! తానే దైవము. సర్వత్రా దైవమే! దైవము లేని పదార్థమే లేదు. దైవము లేని వ్యక్తియే లేదు. దైవము లేని శబ్దమే లేదు. ప్రతి వస్తువునందు, ప్రతి వ్యక్తి యందు, ప్రతి పదార్థమునందు దైవత్వము యిమిడి ఉంటున్నది. ఎలా తెలుసుకోగలవు? నీ చుట్టూ గాలి

sri sathyasai vachanamrutam

ఉంది. నీ కంటికి కనిపిస్తున్నదా? లేదు. కంటికి కనిపించనంత మాత్రమున గాలి లేదనా అర్థం? ఆ గాలి లేక నీవు ఎలా జీవించగలవు? గాలి ఉంది. కానీ కనిపించదు. దానిని పట్టుకోటానికి చేతకాదు. చేతకానంత మాత్రమున గాలి లేదని చెప్పటానికి వీలుకాదు. కంటికి కనిపించనంత మాత్రమున దేవుడు లేడని చెప్పటానికి వీలు లేదు. "నేను ఉన్నాను కాబట్టి దేవుడున్నాడు. ఎందుకంటే దైవత్వములోనే నేను ఉండగలిగాను", ఈ విధమైన ఆత్మ విశ్వాసం అధికంగా ఉండాలి. విశ్వాసము లేకుండా దైవము కావాలంటే ఏరీతిగా లభ్యమవుతుంది? తనపైన తనకు విశ్వాసముండాలి. Faith in yourself and faith in God ఈ రెండు ఉండినప్పుడే నీ అంతరాత్మ ఉంటుంది. నీపై నీకు faith లేదు. దైవంపైన faith లేదు. ఇక దైవాన్ని ఏ రీతిగా నీవు పొందగలవు? ఇది అసాధ్యము. ఎన్ని జన్మలెత్తినా ఇది వీలుకాదు. ఎందుకంటె తనలోనున్న దానిని తాను తెలుసుకోలేకపోతున్నాడు. ఎక్కడకో పోనక్కరలేదు. ఎక్కడో వెతకనక్కరలేదు.

**అంతర్వాణిని అనుసరించు**

ఈనాడు అన్ని దేశములవారు ఈ వైజ్ఞానిక శాస్త్రములో కొత్తకొత్త పరిశోధనలంతా చేస్తున్నారు, ఏనాటినుండో ఎన్నో వేల సంవత్సరముల నుండి ఈ పరిశోధనలు జరుగుతూ వస్తున్నవి భారతదేశములో. హిరణ్యకశిపుడు ఏనాటివాడు? అతను గొప్ప సైంటిస్టు. అతను అనేక రకములుగా పంచభూతములను శోధించాడు. పంచభూతములను హస్తగతము గావించుకున్నాడు. భూమిని క్రమక్రమేణా తిప్పటానికి ప్రయత్నించాడు. చంద్రమండలం కూడా వెళ్లాడు. క్రమక్రమేణా నక్షత్రమండలం పోవటానికి ప్రయత్నించాడు. ధ్రువనక్షత్రం కొంచెం మార్పు చేయాలని ప్రయత్నించాడు. ఈలోపల ప్రళయం ప్రారంభమయింది. అతనికంటె మించినవారా, నేటి సైంటిస్టులు? కాబట్టి, భారతదేశముయొక్క దివ్యశక్తి ఎలాంటిదో అనే విషయాన్ని విద్యార్థులు గుర్తించాలి. విద్యార్థి అయిన బాలుడు, ప్రహ్లాదుడు తండ్రికి బోధించాడు:

**లోకములన్నియున్ ఘడియలోన జయించినవాడవు**
**ఇంద్రియానీకము చిత్తము గెలువనేరవు**

"ఏమి ప్రయోజనము? నీ ఇంద్రియములు నీవు వశము చేసుకోలేనప్పుడు నీవు ఎన్ని చేసి

sri sathyasai vacharamrutam

ఏమి ప్రయోజనము? నేను అన్ని విద్యలు చదివాను. నా గురువులు కూడా అన్ని విద్యలు బోధించారు", అన్నాడు. ఏమి బోధించారో చెప్పమన్నాడు హిరణ్యకశిపుడు.

**చదివించిరి నన్ను గురువులు**
**చదివితి ధర్మార్థ ముఖ్యశాస్త్రంబుల నే**
**చదివినవి కలవు పెక్కులు**
**చదువులలో మర్మమెల్ల చదివితి తండ్రీ**

ఏమిటా మర్మము? 'ఓం నమో నారాయణాయ' ఓం అదే ప్రణవనాదము. అదే ప్రారంభము. అదే ఆది శబ్దము. ఈ ఆది శబ్దమునుండి అ,క,చ,ట,త,ప,య,శ ఎనిమిది అక్షరములు పుట్టాయి. ఈ ఎనిమిది అక్షరములనుండియే సర్వవేదములు ప్రారంభమైనాయి. ఇదియే సర్వవేద ఉపనిషత్తులంతా అభివృద్ధి కావటానికి కారణము. పిల్లలకు తెలుసు, ఇంగ్లీషులో 26 అక్షరములుంటాయి. ఈ 26 అక్షరములతో పెద్దగ్రంథము వ్రాయవచ్చు. వయోలిన్‌లో నాలుగు వైర్లుంటాయి. ఎన్నో రాగాలు పాడవచ్చు. అదే విధముగా, ఈ అ,క,చ,ట,త,ప,య,శ అనే ఎనిమిది అక్షరములతోనే వేదమంతా ప్రారంభమైంది. శబ్దమునుండి వచ్చినది కనుకనే 'శృతి' అని పేరు పెట్టారు. అనగా వినికిడిచేత లభ్యమైంది. ఋగ్వేదము, యజుర్వేదము, సామవేదము, త్రయి. ఋగ్వేదము మంత్ర స్వరూపము. మంత్ర మనగా ఏమిటి? 'ఓం నమో నారాయణాయ,' 'ఓం నమశ్శివాయ', ఇవి కాదు మంత్రములు. మనన, త్రాణ సమ్మిళితం అనగా విన్నటువంటిది మననం చేసుకోటం, మననము చేసినది ప్రాక్టీసులో పెట్టటం. ఈ మూడింటిని చేసేవాడు మనిషి. Thought, word, deed మూడు ఏకం కావాలి. ఇదియే మంత్రము. ఇట్టి మంత్రతత్త్వాన్ని ఎంతగానో బోధిస్తూ వచ్చారు. ఈ మంత్రముయొక్క శక్తి ఎంతో గొప్పది. ఈ ప్రణవనాదములో గొప్పశక్తి ఉంది. ఈ ప్రణవము అకార, ఉకార, మకారములతో కూడినది. ఈ అక్షరములు చేరినప్పుడే శబ్దరూపము పొందుతుంది. గాయత్రీ మంత్రమందు 'భూర్భువస్సువః ' – భూలోక, భువర్లోక, సువర్లోకమన్నారు. ఎక్కడున్నదీ భూలోకము? భూలోకమనగా ప్రకృతి అంటున్నారు కాదు, కాదు. ఇది Materialisation, body, దేహము. భువః vibration ప్రాణము. స్సువః radiation. అదే ప్రజ్ఞానం. ప్రజ్ఞానము, ప్రాణము, దేహము ఈ మూడింటి

srisathyasaivechanamrutam

ఏకత్వమే 'భూర్భువస్సువః'. కనుక ఈ భూలోకము, భువర్లోకము, సువర్లోకము ఎక్కడో లేవు. అంతా మన దేహమే. The one you think you are, అదే body, The one others think you are, అదే life. The one you really are, అదే ప్రజ్ఞానము. దీనినే 'ప్రజ్ఞానం బ్రహ్మ' అన్నారు. విలువలేని ఇనుపపెట్టె, ఇనుప పెట్టెకు ఏమీ విలువ లేదు. కానీ దానిలో పెట్టే నగలకు చాలా విలువవుంది. మన దేహము విలువ లేని ఇనుపపెట్టె. ఇందులో సదాచారములు, సద్గుణములు, సచ్చింతనలు, సత్ప్రవర్తనలు ఇవన్నీ విలువైనవిగా ఉన్నాయి. ఈ లోపల ఉన్నవాటినే మనం చక్కగా ఉపయోగించుకోవాలి. వాటిని కాపాడుకుంటూ రావాలి. అదియే vibration. ఆ vibration లేక దేహమే మాత్రము కలువలేదు. ఇది కేవలం జడమైనది. vibration ఉండాలి. అదే life. ఆ vibrationకి ఒక force ఉండాలి. ఈ బట్ట కదలుతున్నది. ఈ కదలటానికి కారణం ఏమిటి? fan, గాలి. ఆ గాలిచేతనే ఇది కదలుతున్నాది. అదే విధంగా life అనే vibration కు radiation అనే ప్రజ్ఞాన బలం ఉండాలి. వేదము, 'ప్రజ్ఞానం బ్రహ్మ,' 'అయమాత్మబ్రహ్మ,' అన్నది. I am Atma and Brahma. ఎంత సులభమో చూశారా! అన్నీ మననుండే వస్తున్నాయి. తత్త్వమసి. తత్త్వమనగా ఏమిటి? మన బుద్ధియొక్క తత్త్వమే. విత్తనం ఎలాంటిదో చెట్టు అలాంటిది అవుతుంది. మన thoughts ఎలాంటివో మన పనులు అలాగే ఉంటాయి. తత్త్వమసి అనగా అది నేనే. ఏది మన వైబ్రేషన్? 'సోహం.' సో...హం. ఒక తూరి గాలిని పీల్చుకొని మరొకతూరి వదలటం. ఈ రెండూ 24 గంటలు జరుగుతూనే ఉంటాయి. నీవు నిద్రిస్తున్నా, జగడము వేస్తున్నా, నవ్వుతున్నా, భుజిస్తున్నా అది జరుగుతూనే ఉంటుంది. సర్వకాల సర్వావస్థల యందు సోహం తత్త్వం జరుగుతూనే ఉంటుంది. సోహం అంటే అర్థము ఏమిటి? సో అనగా ఆత్మ. హం అనగా నేనే. సోహం అనగా I am Atma. I am God. 24 గంటలలో 21,600 పర్యాయములు నేనే దైవము, నేనే దైవము అని ఉచ్ఛరిస్తున్నారు. కానీ దానిని మనం వినిపించుకోటం లేదు. ఈ అంతర్వాణిని వినకుండా బయటనున్న పుస్తకములు చదువుతూ కూర్చున్నావు. ఈ పుస్తకములో ఏమి ఉందని? పుస్తకములో ఏమీ లేదు. మస్తకములో ఉంది. మొట్టమొదట నీ అంతర్వాణిని అనుసరించు. అదే దైవత్వం, దైవాజ్ఞను నీవు పాలించు అదే నీ సర్వస్వము. ఇన్ని విద్యలు నీవు పుట్టినప్పుడు తెలుసుకున్నావా? లేదు. కానీ ప్రయత్నపూర్వకముగా అభివృద్ధి గావించుకున్నావు.

srisathyasaivahanamrutam

మనలో లేనివి బయటకు రావు. క్రమక్రమేణా బయట పడుతూ వస్తాయి. లేనివి బయటకు రావటానికి వీలుకాదు. ఉన్నవి పోవటానికి వీలుకాదు. Everything is the reflection of the inner being. అన్నీ మన reflection, reaction, resound.

**దివ్యత్వమును పొందుటకు ప్రేమ భావములు పెంచుకోవాలి**

దైవవిషయములో ఒక్క నిర్మలమైన ప్రేమ పెంచుకుంటే చాలు. ఈ విజ్ఞాన శాస్త్రములో ఎన్నో పరిశోధనలు చేయవచ్చు. ఈ పరిశోధనలు ప్రేమ చేతనే చేయాలి. ప్రేమ లేక రీసెర్చి చేయటానికి వీలుకాదు. ఈ రీసెర్చి ఏమిటి? దేనికి చేస్తున్నావు; ఎవరికి చేస్తున్నావు? ఎందు చేస్తున్నావు? ఎలా చేస్తున్నావు? అని ప్రశ్నించుకో. ఆత్మయే దీనికి సాక్షిగా ఉంటుంది. దీనినే ఆత్మసాక్షి అన్నారు. నీ యొక్క భావములు పవిత్రమైనవిగా ఉండాలి. ఇదియే ప్రాచీన కాలమునుండి ఇన్ని పరిశోధనలకు మూలకారణము. ప్రతీదానియందు ఒక మాగ్నెట్ ఉంది. ఆ మాగ్నెట్ యొక్క attraction power ఆ ఆకర్షణ శక్తియొక్క స్వరూపమే భగవంతుడు. ప్రతి మానవునియందు ఉంది. కానీ దైవమందు నూటికి నూరుపాళ్లు ఉంది. కనుకనే జగత్తునంతా ఆవిధముగా ఆకర్షిస్తుంది. అట్టి మాగ్నెట్‌తో చేరినప్పుడు మనం కూడా మాగ్నెట్ అయిపోతాము. బ్రహ్మవిత్ బ్రహ్మైవ భవతి. అయస్కాంతము దగ్గర ఇనుపముక్క పెడితే అది కలుచుకుంటుంది. ఆ యినుపముక్కను అయస్కాంతము దగ్గర అట్లే ఉంచితే మూడవ దినము ఇనుప ముక్క అయస్కాంతమైపోతుంది. ఇదే నిజమైన పరిశోధన. దైవమునకు సమీపముగా ఉన్నప్పుడు, దైవప్రేమకు సమీపంగా ఉన్నప్పుడు, నీవే దైవముగా మారతావు. You become God. కనుక మనం దివ్యత్వము పొందుటకు ఏ సాధనలు చేయనక్కరలేదు. ప్రేమ భావాలు మనలో రావాలి. అదియే దైవత్వముగా మారిపోతుంది.

**దైవప్రేమ మార్పులేనిది**

నిన్నటి దినము వైస్‌ఛాన్సలరు, విద్యార్థులు అందరము కలసి మాట్లాడుకున్నాము. 'స్వామీ' 'మా అదృష్టము అన్నారు!' 'అదృష్టమంటే ఏమిటి?' 'good luck' అన్నారు. 'good luck' అంటే ఏమిటి. 'మంచిప్రాప్తి' అని ఏమేమో చెబుతూవచ్చారు. కానీ అదృష్టం అది కాదు. దృష్టికి కనిపించనిది, అదృష్టము. అదియే దైవత్వము. దృష్టికి కనిపించదు. ఆ అదృష్టము



sri sathyasai vachanamrutam

అన్నీ తెచ్చిపెడుతుంది. అన్ని ప్రాప్తులను కలిగింపచేస్తుంది. శారీరక, మానసిక, ఆధ్యాత్మిక తత్త్వములను కూడా వికసింపచేస్తుంది. భౌతిక, లౌకిక, ఆధ్యాత్మికములను కూడా వెలిగింప చేస్తుంది. ధార్మిక, నైతిక విజ్ఞానములను వెలిగింపచేస్తుంది. అదే దైవదృష్టి. అదృష్టమనగా good luck కాదు. ఆ అదృష్టం రావాలంటే దైవప్రేమచేతనే రావాలి. ఆ ప్రేమకు మించినది మరొకటిలేదు. ఈ ప్రేమ అందరియందు ఉంది. కాని ఎట్టి ప్రేమ? ప్రాకృతమైన ప్రేమ కాదు అది. స్వార్థరహితమైన ప్రేమ. భార్యాభర్తల ప్రేమలో స్వార్థముంది. అన్నదమ్ముల ప్రేమలో స్వార్థముంది. తల్లీబిడ్డల ప్రేమలో స్వార్థముంది. ఇవన్నీ ప్రాపంచిక ప్రేమలు. దైవప్రేమ heart to heart ఎప్పుడూ ఉండేది. మార్పురానిది. ఇది ప్రేమచేతనే వచ్చేది. జపం చేసుకుంటూ కూర్చుంటే జపమాల చేతిలో ఉందిగానీ బుద్ధి మార్కెట్టులో ఉంది. ధ్యానమునకు కూర్చుంటున్నాము. ఏమిటి ఈ ధ్యానం? ఫోటోకోసం కూర్చుంటున్నారా? దీనివలన దైవత్వము లభించదు. ఇవి మానసిక స్థిరత్వమునకు మార్గములు. దైవమును పొందుటకు ప్రేమ ఒకటే మార్గము. కనుక ఈ ప్రేమను దైవప్రేమగా మార్చుకోవాలి. నీవు ఏపని అయినాచేయి ఆఫీసుకువెళ్ళు, సేద్యం చేసుకో, వ్యాపారము చేసుకో ఏపని చేసినా భగవత్ప్రీత్యర్థము చేయి. తప్పక అదే జరుగుతుంది. మాటలతో చెప్పినంతమాత్రమున చాలదు. హృదయము నుండి రావాలి. తప్పక క్షణములో దైవం చిక్కుతుంది. వెతకనక్కరలేదు. ఎందుకంటే ఎక్కడో ఉంటే కదా వెతికేది. తల్లితండ్రులైనా కొంత దూరం కావచ్చుగానీ దైవం దూరం కాదు. దైవం ఎప్పుడు వెంటనే, ఇంటనే, జంటనే ఉంటాడు. అట్టి దైవత్వమును పొందటానికి ప్రేమ ఒక్కటే చాలు. ఈ ప్రేమను సంపాయించుకోండి. అప్పుడే దైవత్వము మీకు లభ్యమవుతుంది.

**దుఃఖములకు, కష్టములకు కారణం, నెగెటివ్ ఆలోచనలే!**

మన భారతీయ సంస్కృతి ఇంత సులభమార్గమును బోధిస్తూ వచ్చింది. మన వైస్ ఛాన్సలర్ చెప్పాడు. గుమ్మానికి మామిడి ఆకులు కడతారు, అని. అలంకారము కోసం ప్లాస్టిక్‌ని కట్టేస్తారు. అయితే green leaves ఎందుకు కడుతూవచ్చారు? ప్రాచీన కాలమునుండి మూర్ఖులైన పల్లెలవారుకూడా సైన్సు తెలుసుకున్నారు. చిన్నయింటిలో పెండ్లి జరుగుతూ ఉంటుంది. ఇంటిముందు పచ్చని ఆకులతో పందిరి వేస్తారు. ఎందుకోసం వేస్తారు? ఆ చిన్న

srisathyasaivacharamrutam

పందిరిలో ఎక్కువమంది చేరతారు. వారు విడచిన కార్బన్ డయాక్సైడ్ ఆ పచ్చని ఆకులు పీల్చుకుంటాయి. అవి మనకు ప్రాణవాయువు నందిస్తాయి. దీనిని ఏనాడో పల్లెలవారు కనిపెట్టారు. అందుకే వారికి ఏ జబ్బులు వచ్చేవికాదు. హార్టు జబ్బులు అసలే లేవు. ఉబ్బసమనేదే లేదు. ఎందువలన? ఈ కార్బన్ డయాక్సైడ్ వృక్షములంతా తీసుకుంటున్నాయి. వృక్షములెంత ఉపకారము చేస్తున్నాయి. ప్రాణవాయువునే అందిస్తున్నాయి. కానీ ఈ సత్యాన్ని గమనించలేక చదువులు పెరిగేకొలది వృక్షాలను కొట్టివేస్తున్నారు. కనుక మనకు ఆక్సిజను తక్కువై పోయింది. మనకు మనం చేతులారా తెచ్చుకుంటున్నాము ప్రమాదములు.

మన దుఃఖములకు, కష్టాలకు కారణం మన నెగిటివ్ ఆలోచనలే. ప్రాకృతమైన నెగిటివ్ ఆలోచనలు పాజిటివ్‌గా పెట్టుకో. ఒక బల్బు ఉంది. ఒక పాజిటివ్‌లో పెట్టు, రాదు. పాజిటివ్ నెగిటివ్ రెండూ చేరినప్పుడే కాంతి వస్తుంది. Body negative. నీ life Positive. ఈ రెండు చేరినప్పుడే vibration. Vibration అంటే ఏమిటి? సత్యం జ్ఞానం అనంతం బ్రహ్మ. అదియే truth, అదియే wisdom. ఇది కేవలం ప్రేమచేతనే వస్తుంది. ప్రేమలేని హృదయంలో general knowledge వస్తుంది. General knowledge ఉండి ఏమి ప్రయోజనము. ఈ General knowledge కి commonsense ఏకం కావాలి. ఆ రెండు చేరినప్పుడే అక్కడ Practical knowledge బయలుదేరుతుంది.

**జీవాత్మ, పరమాత్మల ఏకత్వమే సచ్చిదానందము**

విద్యార్థులారా! "వైజ్ఞానిక శాస్త్రము అమెరికాలో, రష్యాలో, జర్మనీలో చాలా అభివృద్ధి అయింది, మన భారతదేశములో లేదు," అని మీరు తలచరాదు. ఈ దేశములకంతా భారత దేశమునుండే పోయింది. భారతదేశమునుండి వచ్చిన అథర్వణ వేదమే సర్వదేశములకు విజ్ఞానము నందిస్తోంది. సమస్త అస్త్ర శస్త్ర విద్యలన్నీ అథర్వణ వేదములో ఉన్నాయి. ఆరోగ్యమునకు సంబంధించినవన్నీ అథర్వణ వేదము నందున్నాయి. దీనినే భారద్వాజ మహర్షి కనిపెట్టాడు. గణితములో 3−1=2 అంటారు. ఇది లౌకికమైన జవాబు. ప్రపంచమునకు రైటే. కాని ఆధ్యాత్మికము నందు 3−1=1 అంటారు. అది ఎలా? ప్రపంచము ఒప్పుకోదే! ప్రపంచము ఒప్పుకోనక్కరలేదు, నేను ఒప్పుకుంటాను. నాకు అది సత్యమే! ఎలా సత్యము?

sri sathyasai vachanamrutam

చిన్న ఉదాహరణ. ఒక అద్దముంది. నీవు పోయి అద్దము ముందు నిల్చున్నావు. నీవు, అద్దము, ప్రతిబింబము మూడున్నాయి. అద్దము తీసివేయి. ప్రతిబింబము కూడా పోతుంది. మొదట చూస్తే నీవు, అద్దము, ప్రతిబింబము మూడున్నాయి. ఈ మూడింటిలో అద్దము ఒకటి తీసివేస్తే నీవే ఉంటావు. అద్దముతో బాటు ప్రతిబింబము కూడా పోతుంది. అనగా దేవుడు– నీవు. జీవుడు– ప్రతిబింబము. ప్రకృతి– అద్దము. ప్రకృతి అనే అద్దములో జీవుడనే ప్రతిబింబము కనిపిస్తోంది. ప్రకృతిని నీవు మరచిపో. నీవు ఒక్కడే దేవుడై పోతావు. ప్రకృతి ఉన్నంతవరకే జీవుడు. ఇంకొక చిన్న ఉదాహరణ: ఇది పగలు. కనుక ప్రపంచమంతా కనిపిస్తోంది. ప్రపంచము కనిపించేంతవరకు దుఃఖము మనలను ఆవరించి ఉంటుంది. రాత్రి నిద్ర పోతావు. నిద్రలో ప్రపంచము లేదు. ఏదీ కన్పించదు, దుఃఖము కూడా లేదు. ప్రపంచము ఉన్నప్పుడు దుఃఖము ఉంది. ప్రపంచము మరచిపోయే నిమిత్తము మెడిటేషన్ అన్నారు. ప్రపంచమును ఆ కొద్ది సమయమైనా మరవాలి. ఎప్పుడు? ఆనందములో మునిగి ప్రపంచము మరచిపోతాం. కనుకనే ఆనందం, నిత్యానందం. అదే పరమానందము. అదే యోగానందము. అదే అద్వైతానందము. అదే సచ్చిదానందము. సత్ చిత్ రెండూ చేరినప్పుడు ఆనందము. పిల్లలు తెలుసుకోవాలి. సత్ అనగా being ఎప్పుడు మార్పుచెందక ఉండటం. ఏది మార్పు చెందనిది? Sugar చేతిలో ఉంది. ఈ Sugar పాయసంలో వేయి, టీలో వేయి, కాఫీలో వేయి దేనిలో వేసినా తీపి తీపే. ఇది ఏనాటికి మారదు. ఎక్కడున్నా మారకుండా ఉంటుంది. దేనిని ఇది చేరుతున్నదో దానికి కూడా దీని గుణము నందిస్తుంది. ఇది చిత్. ఇది నీరు. గుట్టపైన పోస్తే క్రిందికీ దిగుతాయి. క్రిందికి దిగే స్వభావము. చిత్ water. సత్ sugar రెండు కలిపితే వాటర్ కాదు, షుగర్ కాదు, సిరప్ అవుతుంది. జీవాత్మ, పరమాత్మ ఏకత్వం అదే శాశ్వతానందము. అదే సచ్చిదానందము. అదే అద్వైతానందము. దీనినే 'ఏకమేవ అద్వితీయం బ్రహ్మ' అన్నారు.

**మానవునియందు సమస్త శక్తులు ఉన్నాయి**

మనము దైవత్వము కోసమని అనేక రకములుగా ప్రయత్నములు చేయనక్కరలేదు. ప్రేమను పెంచుకోండి. అందరిని ప్రేమించండి. అందరిలోను దైవత్వము ఉన్నదని విశ్వసించండి. అయితే, నీ తత్త్వము దైవత్వములో ఏకము చేయాలి. విద్యార్థులు భారతీయ సంస్కృతిగురించి

srisathyasaivachanamrutam

ఎంతో తెలుసుకోవలసి ఉంది. ఈనాటి పిల్లలు కొన్ని రకములైన యోచనలు చేస్తుంటారు. "స్వామి చెబుతుంటారు కదా, Caste of humanity అని. ఎవరైతేనేమి, పెండ్లి చేసుకుందాం", అనుకుంటారు. నిజమే కులము లేదు, కానీ కల్చరు మాట ఏమిటి? Caste తీసుకుంటున్నావు. culture కూడా తీసుకోవాలి. సంస్కృతి ఇంకొక దానిలో కలవదు. మిగతాదానితో కలవదు. మనము మొట్టమొదట కల్చర్ గురించి విచారించుకోవాలి. దీనినే సాంప్రదాయము అన్నారు. సాంప్రదాయమును అనుసరించినప్పుడు సుక్షేమము లభిస్తుంది. తప్పక సాంప్రదాయమును అనుసరించాలి. అస్తవ్యస్త చదువులన్నీ చదివి అన్నీ సమానము అనుకుంటున్నాము. త్యాగరాజు చెప్పాడు: "ఓ భగవంతుడా! చీమ మొదలుకొని బ్రహ్మ వరకు నీవే ఉంటున్నావ"ని చెప్పాడు. అయితే చీమ కుట్టినప్పుడు కొట్టివేస్తాము, బ్రహ్మ వచ్చినప్పుడు నమస్కరిస్తాము. ఈ సమత్వము ఎక్కడ పోయింది? చీమలో బ్రహ్మలోనున్నప్పుడు చీమకు కూడా నమస్కారం చేయాలికదా! చేయము మనము. ఆకారమును ఆధారం చేసుకున్నాము మనము. ఆకారము కాదు, ఆనందము ప్రధానము. దీనిలోను దైవత్వము ఉంది, దానిలోను దైవత్వము ఉంది. చీమ ఎంత చిన్నది! కుడితే ఎంత నొప్పి! ఇంతశక్తి ఉంటున్నది. చీమ చిన్నదే, ఇంత శక్తి దానికి ఎక్కడ నుంచి వచ్చింది? చీమలోనే ఇంత శక్తి ఉన్నప్పుడు మానవునిలో ఎంతశక్తి వుండాలి? మానవునియందు సమస్త శక్తులు ఉంటున్నాయి. ఆ శక్తి లేని మానవుడే లేడు. కానీ తెలుసుకొనలేక అవస్థ పడుతున్నాడు. తెలుసుకుంటే సులభంగా ఆనందిస్తాడు. దైవత్వమును మన హృదయమందు చిత్రించుకొని తద్వారా ఆనందమును అందుకొనుటకు ప్రయత్నించండి. దేహమునకు ఒక పవిత్రత కావాలి. దేహము పవిత్రము కావాలంటే దైవనామము స్మరించాలి. మనసు పవిత్రము కావాలంటే ధ్యానములో పోవాలి. జపసహిత ధ్యానము, ధ్యాన సహిత జపము రెండు ఉండాలి. రెండింటి యందు సమత్వము చేసేదే ప్రేమ తత్త్వము. తాళము ఉంటున్నాది. రెండు తాళములు కలసినప్పుడే శబ్దము వస్తుంది. జప, ధ్యానములు రెండు చేరినప్పుడే నిర్వికల్పస్థితి ఏర్పడుతుంది. ఆనిర్వికల్పమే నిజమైన వికల్పము. గాఢమైన ప్రేమ ఉండాలి. విశ్వాసము కూడా ఉండాలి. విశ్వాసము మనం పెంచుకోవాలి. ఈ ప్రేమ మనం సాధించాలి.

1996 జూన్ 17వ తేది  సాయికుల్వంత్‌హాల్‌లో భగవాన్ దివ్యోపన్యాసం

srisathyasaivachanamrutam